క్లుప్తంగా

6న సీతారాముల కల్యాణోత్సవం

గరుగుబిల్లి: శ్రీరామనవమి పురస్కరించుకుని, తోటపల్లి శ్రీకోదండరామస్వామి ఆలయంలో ఈ నెల 6వ తేదీన సీతారాముల కల్యాణోత్సవం చేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వీవీ సూర్యనారాయణ ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. వసంత నవరాత్రుల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు స్వామి వారికి పూజలు, అభిషేకాలు, అర్చనలు చేయనున్నామని అర్చకులు అప్పలాచార్యులు అన్నారు. స్వామి వారి కల్యాణ వేడుకల్లో పాల్గొనాలకునే దంపతులు రూ.500 చెల్లించి, తమ గోత్రనామాలు తెలపాలన్నారు. కల్యాణం అనంతరం శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం ఉంటుందన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

పాలకొండ: నగర పంచాయతీలో నెలకొన్న తాగునీటి సమస్యను అధికారులు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. తాగునీటి సమస్యను ఇప్పటికే పలుమార్లు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు. కుళాయిల ద్వారా అరకొరగా తాగునీరు సరఫరా అవుతోందని, అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో నగర పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి



కాశీపేట మిల్క్ సొసైటీ ఆవరణలో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

సీతానగరం: పశువులకు జబ్బువాపు, నోటిసంచలకు సంబంధించిన టీకాలను వేయించాలని పశు సంవర్ధక శాఖ ఎ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్ అన్నారు. మండలంలోని కాశీపేటలో పశు వైద్యాధికారి ఎస్. రామారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎ.డి మాట్లాడుతూ.. పశువుల్లో వచ్చే వివిధ రకాల వ్యాధుల నివారణకు ముందస్తుగా టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మీపురం, గెడ్డలుప్పి, అంటిపేట గ్రామాల పశువైద్య సహాయకులు, పాడి రైతులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు



ఆర్. వెంకంపేట జంక్షన్ చలివేంద్రంలో దాహం తీర్చుకుంటున్న వాహన చోదకులు

సీతానగరం: మండలంలోని జాతీయ రహదారి మీదుగా ప్రధాన కూడళ్ల వద్ద దాతలు చలివేంద్రాలు ఏర్పాటు చేయడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పార్వతీపురం నుంచి సీతానగరం మీదుగా విశాఖపట్నం వెళ్లే జాతీయరహదారిలో ప్రధాన కూడళ్లుగా ఉన్న ఆర్. వెంకంపేట, పణుకుపేట జంక్షన్‌లలో ఆయా గ్రామాల పెద్దల ఆర్థిక సహకారంతో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. మండుటెండలో రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఈ చలివేంద్రాలు ఎంతో ఉపయోగకరంగా మారాయి.

సిమిడివలస రోడ్డు ప్రారంభం



రోడ్డును ప్రారంభిస్తున్న గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి

సాలూరు రూరల్: సాలూరు మండలంలోని తోణాం పంచాయతీ సిమిడివలసకు రూ.1.25 కోట్లతో వేసిన రోడ్డును గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సోమవారం ప్రారంభించారు. వాస్తవానికి ఈ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన నిధులను వైఎస్సార్‌సీపీ హయాంలో విడుదల చేశారు. అప్పట్లోనే రోడ్డు పనులకు అప్పటి డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర శంకుస్థాపన కూడా చేశారు. తాజాగా పనులు పూర్తి కావడంతో మంత్రి ప్రారంభించి, వినియోగంలోకి తీసుకువచ్చారు.

కమ్యూనల్ అవార్డులు అమలు చేయండి

బొబ్బిలి: ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాధించి పెట్టిన కమ్యూనల్ అవార్డులను అమలు చేయాలని స్థానిక అంబేడ్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. సమసమాజ భావన కలగాలన్నా, ఆర్థిక అసమానతలు తొలగాలన్నా, అందరూ సమానమేనన్న ఆలోచన ప్రతిఒక్కరూ చేయాలన్నా అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం, ఆయన కృషి ఫలితంగా పుట్టుకొచ్చిన కమ్యూనల్ అవార్డుల అమలు జరగాల్సిందేనన్నారు. దీనిపై ప్రభుత్వాలు స్పందించాలన్నారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష..

ఠారెత్తిస్తున్న భానుడు



- చిన్నారులు, వృద్ధులకు పొంచి ఉన్న ప్రమాదం
- చిన్నారుల ఆహారపు అలవాట్లలో మార్పులు తప్పనిసరి
- చిన్న పిల్లల వైద్యుడు రవికుమార్

పాలకొండ రూరల్/భామిని:

ప్రస్తుత వేసవిలో ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. గతేడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది ఎండలు భారీగానే ఉన్నాయని చెప్పాలి. అప్పుడే 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా ఎండలు చిన్నారులు, వృద్ధులపై తీవ్ర ప్రభావం చూపుతాయి. తగు జాగ్రత్తలు పాటించకపోతే ఆరోగ్యపరమైన ఇబ్బందుల బారిన పడే అవకాశముందని పాలకొండ ఏరియా ఆస్పత్రి చిన్నపిల్లల వైద్య నిపుణుడు కొల్ల రవికుమార్ తెలిపారు. బాలింతలు, చంటి పిల్లలు, వృద్ధులకు సంబంధించి రోజువారీ దినచర్యలో, ఆహారపు అలవాట్లలో స్వల్ప మార్పులు, జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- చంటి పిల్లలకు తల్లి పాలు అధిక మోతాదులో ఇవ్వాలి. తద్వారా బిడ్డ శరీర ఉష్ణోగ్రతల్లో ఎటువంటి మార్పులు చోటుచేసుకోకుండా ఆరోగ్యంగా ఉంటారు.
- ఉష్ణోగ్రతలు పెరిగితే చిన్నారులు పచ్చకామెర్ల (జాండిస్) బారిన పడే ప్రమాదం ఉంటుంది. మూడేళ్ల వయసున్న పిల్లలకు దాహం తీరేవరకు గంటకు ఓ సారి నీటిని అందించడం మేలు.

జాగ్రత్తలు తప్పనిసరి..

ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయాల్లో ప్రయాణాలు మానుకోవాలి. తప్పనిసరి అయితే ఓఆర్ఎస్ వెంట ఉంచుకోవాలి. దాహం లేకున్నా నీటిని తాగుతూ ఉండాలి. శరీరం నిండా కప్పి ఉంచేలా కాటన్ దుస్తులు ధరించాలి. కళ్లజోడు, టోపీ ధరించడం మంచిది.

డాక్టర్ సంతోషి లక్ష్మి,
వైద్యాధికారి, భామిని



ఎండకు దాహం తీర్చుకుంటున్న చిన్నారి

- వేడి గాలుల నుంచి రక్షణ కోసం పలుచని కాటన్ దుస్తులు వేయాలి. ఈ దుస్తులు ఎప్పటికప్పుడు తడిపి వాడడం మంచిది.
- మూత్రం సక్రమంగా రాకపోవడం, నోరు తడి ఆరిపోవడం, చర్మం పొడిబారడం, వాంతులు, విరేచనాలను గుర్తిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.
- శరీరానికి చల్లదనం చేకూర్చే కొబ్బరి, బార్లి నీళ్ల వంటివి ఇవ్వడం శ్రేయస్కరం.
- మూడేళ్లు పైబడిన పిల్లల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. వేసవిలో వీరికి మూత్రపిండాల సంబంధిత సమస్యలు అధికంగా వస్తుంటాయి.
- పిల్లలతో పాటు గర్భిణులు, బాలింతలు, వృద్ధుల శరీరంలో ఉష్ణోగ్రతల సమతుల్యతను కాపాడుకునేందుకు వైద్యుల సూచనలు తీసుకోవాలి.
- పాలకూర, ముల్లంగి, వెల్లుల్లి, నీరుల్లి, బీట్‌రూట్ రోజువారీ ఆహారంలో ఉండేలా చూసుకోవాలి.
- సీజనల్ పండ్ల జాతులు తీసుకోవడం ఉత్తమం.
- సబ్జా, బార్లీ, కొబ్బరి నీరు. పలుచని మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలి.

ఈ నెల 7 నుంచి ఎస్ఏ-2 పరీక్షలు

గరుగుబిల్లి: మండలంలోని అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు ఏప్రిల్ 7వ తేదీ నుంచి ఎస్ఏ(సమ్మేటివ్ అసెస్‌మెంట్)–2 పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో దత్తి అప్పలనాయుడు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. ఏప్రిల్ 7 నుంచి 17వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని, 1 నుంచి 8వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, 9వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 1 నుంచి 5 తరగతుల విద్యార్థులకు ఏప్రిల్ 9న మొదటి లాంగ్వేజ్, ఏప్రిల్ 10న ఇంగ్లిష్, ఏప్రిల్ 11న గణితం, ఏప్రిల్ 12న ఈవీఎస్(3,4,5 తరగతులకు), ఏప్రిల్ 15న ఓఎస్ఎస్‌సీ(3,4,5 తరగతులకు) పరీక్షలు ఉంటాయన్నారు. 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులకు తొలిరోజు మొదటి లాంగ్వేజ్, ఏప్రిల్ 8న సెకండ్ లాంగ్వేజ్, ఏప్రిల్ 9న థర్డ్ లాంగ్వేజ్, ఏప్రిల్ 10న గణితం, ఏప్రిల్ 11న ఫిజికల్ సైన్స్, ఏప్రిల్ 12న బయాలజీ, ఏప్రిల్ 15న సోషల్ స్టడీస్, ఏప్రిల్ 16న ఓఎస్ఎస్‌సీ–1, ఏప్రిల్ 15న ఓఎస్ఎస్‌సీ–2 పరీక్షలు ఉంటాయన్నారు.

జోగిరాజుపేటలో గజరాజుల సంచారం



జియ్యమ్మవలస: మండలంలోని జోగిరాజుపేట పంటపొలాల్లో గజరాజుల గుంపు సంచరిస్తోంది. సోమవారం ఉదయం పొలాలకు వెళ్తున్న వారికి మొక్కజొన్న పంటలో నుంచి వస్తున్న ఏనుగుల గుంపు కనిపించింది. సుభద్రమ్మవలస, కన్నపుదొరవలస మీదుగా జోగిరాజుపేటకు ఓ ఐదారు ఏనుగులు తరలివెళ్లినట్లు పలువురు రైతులు చెబుతున్నారు. వరి ఉభాలు వేసి నెలరోజులే అయిందని, వరి పొలాల్లోకి ఏనుగులు దిగితే పంట అంతా నాశనమవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్‌లో ఆకస్మిక తనిఖీలు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్‌లో తహసీల్దారు ఎన్.శేఖర్ సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిత్యావసర సరుకుల నిల్వలు, నాణ్యతలను రికార్డులు చూసి పరిశీలించారు. డీఆర్ డిపోలు, ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలకు సకాలంలో నిత్యావసర సరుకులు సరఫరా చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో గొడౌన్ సూపరింటెండెంట్ ఎం.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసర సరుకుల నాణ్యతను తనిఖీ చేస్తున్న తహసీల్దారు శేఖర్

ఘనంగా రంజాన్ వేడుకలు



గుమ్మలక్ష్మీపురం(కురుపాం) కురుపాం మసీదులో రంజాన్ ప్రార్థనల్లో ముస్లిం సోదరులు



భామిని: బత్తిలి మసీద్‌లో నమాజ్ చేస్తున్న ముస్లింలు



పాలకొండ రూరల్: జామియా మసీదులో ఖురాన్ పఠిస్తున్న మతగురువు ఇర్ఫాన్

ముస్లిం సోదరులు రంజాన్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. మానవత్వానికి, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచే ఈ పండగను ఇస్లాం క్యాలెండర్ ప్రకారం రంజాన్ మాసంలో ఏటా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. దాదాపు నెల రోజుల ఉపవాస దీక్షల అనంతరం వచ్చే ఈ పవిత్రమైన రోజున ముస్లింలంతా మసీదులకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సాయంత్రం ఇఫ్తార్ విందు ఆరగించి దీక్షలు విరమించారు. అనంతరం పేదలకు దానధర్మాలు చేశారు. అల్లాహ్ ఆశీస్సులు అందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

–పాలకొండ, కురుపాం నెట్‌వర్క్

ముగిసిన క్రీస్తు సువార్త సభలు

గుమ్మలక్ష్మీపురం: జనులంతా ఏసుక్రీస్తు చూపిన మార్గంలో నడవాలని పాస్టర్ ఎదురు మొండి మోజేష్ కోరారు. మండలంలోని కోసంగిభద్ర గ్రామంలో రెండు రోజుల పాటు నిర్వహించిన క్రీస్తు సువార్త ఉజ్జీవ సభలు సోమవారం సాయంత్రంతో ముగిశాయి. పాస్టర్ స్టీవెన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, ఏసుప్రభువు సందేశాన్ని తెలిపారు. ప్రతిఒక్కరూ శాంతి, సమాధానంతో జీవించాలని, ఎదుటవారి కష్టసుఖాలను పంచుకోవాలని, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని తెలిపారు.

మహిళా ఉద్యమానికి స్ఫూర్తి 'ఉదయం'



ఉదయం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పార్వతీపురం: మహిళా ఉద్యమానికి మోటూరు ఉదయం ఎంతో స్ఫూర్తిదాయకమైన నాయకురాలని ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, శ్రామిక మహిళా జిల్లా నాయకురాలు వి. ఇందిర అన్నారు. పట్టణంలోని సుందరయ్య భవనంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మోటూరు ఉదయం వర్ధంతి సభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ.. ఉదయం చేసే ఎన్నో పోరాటాలు, విప్లవ అంశాలు సినిమాలకు స్ఫూర్తినిచ్చాయని చెప్పారు. ఆమె ఇద్దరు పిల్లలు ఉష, టాన్యాలు కూడా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారన్నారు. అల్లూరి మన్మోహిని, మల్లు స్వరాజ్యం, కోటేశ్వరమ్మ లాంటి త్యాగధనులను ఆదర్శంగా తీసుకుని ఉద్యమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. మన్మథరావు, నాయకులు జి. వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కొరమ కాజ్‌వే



భామిని: భామిని, కొత్తూరు మండలాల మధ్య కొరమ గెడ్డపై గల కాజ్‌వే ప్రమాదకరంగా మారింది. కాజ్‌వేపై గోతులు ఏర్పడడంతో వాహనాల రాకపోకలు ప్రమాదకరంగా మారాయి. వాహనదారులను అప్రమత్తం చేసేందుకు ఇటీవల గోతుల్లో ఎర్ర జెండాలు పాతారు. కొత్తూరు నుంచి బత్తిలి వచ్చే ఆర్టీసీ బస్సులు వరదకాలువ మట్టిగట్టు దాటి కొరమ వద్ద ఏబీ రోడ్డు ఎక్కుతున్నాయి. అయితే ఈ కాజ్‌వేపై ప్రయాణాలు ప్రమాదకరమని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కాజ్‌వేకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..



పాలకొండ మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బస్సులు బయటకు వచ్చే ప్రాంతంలో ప్రధాన కల్వర్టుకు రంధ్రం ఏర్పడింది. సిమెంట్ పలకలు విరిగిపోవడంతో ఏర్పడిన రంధ్రం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- పాలకొండ రూరల్

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలని కాంగ్రెస్ పార్టీ కురుపాం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన కురుపాం మండల కేంద్రంలోని విలేకరులతో సోమవారం మాట్లాడారు. దైవసేవకుడు అయిన పాస్టర్ ప్రవీణ్ మరణంపై ఆయన కుటుంబ సభ్యులతో పాటు యావత్తు క్రైస్తవ సమాజానికి పలు అనుమానాలు ఉన్నాయన్నారు. ఆయన మరణం వెనక ఉన్న రహస్యాలను ఛేదించాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన పోస్టుమార్టం వివరాలను ప్రజలందరికీ తెలియజేయాలన్నారు. ఆయనను హత్య చేస్తే హత్య చేసిన వారిని వెంటనే పట్టుకుని శిక్షించాలని కోరారు.

పనిభారం తగ్గించాలి

పార్వతీపురం: గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలపై పనిభారం తగ్గించాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి స్వర్ణలత డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. హెల్త్ సెక్రటరీలను ఆరోగ్యశాఖ పరిధిలోకి తీసుకురావాలన్నారు. వర్క్ పెర్ఫార్మెన్స్ పేరుతో పనిచేయని ట్యాబ్‌లను ఇచ్చి అందులో రిపోర్టులు రావడం లేదనే సాకుతో సిబ్బందికి షోకాజు నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. గ్రేడ్ – 3 ఏఎన్ఎంలకు ఎంపీహెచ్ ఫిమేల్‌గా ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. రికార్డుల నిర్వహణలో అవసరమైన శిక్షణ ఇవ్వాలని కోరారు. యూనిఫాం అలవెన్సులతో పాటు వర్క్ పెర్ఫార్మెన్సు అలవెన్సులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వై.మన్మథరావు, డి.రమాదేవి, ఎం.ఇందిర, టి.లక్ష్మి, సరస్వతి, భారతి, లత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఏఎన్ఎంలు, యూనియన్ ప్రతినిధులు

పూట గడవడం లేదు..

- ఉపాధి వేతనదారులకు అందని బిల్లులు
- ఏడు వారాలుగా ఎదురుచూపు
- బిల్లులు మంజూరు చేయాలంటున్న కూలీలు

సీతానగరం:

చేసిన పనులకు బిల్లులు అందక ఉపాధి వేతనదారులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారిని ఆర్థికంగా భరోసా కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకంలో భాగంగా గ్రామంలో ఉన్నవారికి స్థానికంగానే పనులు కల్పిస్తూ రోజువారీ వేతనం చెల్లిస్తున్నారు. మండలంలో 15,206 కుటుంబాలకు జాబ్ కార్డులుండగా... వీరిలో 14,690 కుటుంబాలకు లక్ష్యం మేరకు పనులు కల్పించారు. వేతనదారులందరూ సోక్‌పిట్లు, మట్టి రోడ్డు పనులు, ఫారంపాండ్స్, కాలువల అభివృద్ధి, తదితర పనుల్లో పాల్గొంటున్నారు. అయితే వీరందరికీ ఏడు వారాలుగా బిల్లులు అందలేదు. చేసిన పనులకు వెంట వెంటనే బిల్లులు మంజూరు చేయాల్సిన అధికారులు ఎందుకు తాత్సారం చేస్తున్నారో అర్థం కాక వేతనదారులు తలలు పట్టుకుంటున్నారు. కనీసం ఉగాది పండగకు అయినా డబ్బులు పడతాయని ఎదురు చూశారు. కాని నిరాశే మిగిలింది. డబ్బులు అందకపోవడంతో కుటుంబాలను నెట్టుకురావడం ఇబ్బందిగా ఉందని వేతనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చేసిన పనులకు వెంటనే బిల్లులను బ్యాంక్ ఖాతాలకు జమ చేయాలని కోరుతున్నారు.



బల్లకృష్ణాపురంలో ఫారంపాండ్ పనుల్లో వేతనదారులు

బిల్లులు చెల్లించాలి..



ఇంటి ముందు సోక్‌పిట్ తీసుకుంటే పది రోజుల్లోగా బిల్లులు వేస్తామని అధికారులు చెప్పడంతో వ్యవసాయ పనులు మాని మా కుటుంబ సభ్యులందరం సోక్‌పిట్ పనులు చేశాం. పని పూర్తయి ఆరు వారాలు గడిచాయి. ఇంతవరకు బ్యాంక్ ఖాతాకు డబ్బులు జమకాలేదు. తక్షణమే అధికారులు స్పందించి, బిల్లులు చెల్లించాలి.

– సీహెచ్ సత్యనారాయణ,
బగ్గందొరవలస, జాబ్‌కార్డుదారుడు

అప్‌లోడ్ చేశాం..



ఉపాధి పనులకు సంబంధించి బిల్లులు చెల్లించేందుకు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశాం. ఇప్పటివరకు ఏడు వారాల బిల్లులు చెల్లించాల్సి ఉంది. త్వరలో రెండు వారాలకు సంబంధించిన నగదు విడుదలయ్యే అవకాశం ఉంది. నిధులు విడుదల కాగానే బ్యాంక్ ఖాతాలకు జమ చేస్తాం.

– భాను, ఎన్ఆర్ఈజీఎస్,
ఏపీఓ, సీతానగరం

నేడు ఆలయ వార్షికోత్సవం

గురుబిల్లి: మండలంలోని గిజబ గ్రామంలో ఉన్న శ్రీకాశీవిశ్వేశ్వరాలయ ప్రథమ వార్షికోత్సవం మంగళవారం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ మండల భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు మరడాన సింహాచలం నాయుడులు సోమవారం తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో భాగంగా గురువారం అన్నదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.